క్లుప్తంగా

సమస్యలపై విద్యార్థుల ప్రదర్శన


నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని తమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఉదయం ఏకలవ్య పాఠశాల నుంచి ములకపాడు వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. యజమాన్యం పాఠశాల సమస్యలను పరిష్కరించాలని, ఆర్‌సీఓ వెంటనే రావాలని నినాదాలు చేశారు. ఏకలవ్య పాఠశాలలో గత రెండు రోజులుగా నీటి సమస్య ఏర్పడిందని, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. 200మంది వరకు ఉన్న విద్యార్థులకు కేవలం రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరారు.

అవినీతిని సహించేది లేదు..

అశ్వాపురం: విద్యుత్ శాఖలో అవినీతిని సహించేది లేదని విద్యుత్ శాఖ ఏడీ ఉమారావు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో విద్యుత్ కాంట్రాక్టర్ రాముపై అవినీతి ఆరోపణలు రావడంతో అతని కాంట్రాక్ట్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టామన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలు 1912కు డయల్ చేసి తెలపాలన్నారు. ప్రజలు నేరుగా సమస్యలు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఏఈ మణిదీప్, లైన్ ఇన్‌స్పెక్టర్ పెద్దిరాజు కోటేశ్వరరావు, ఫోర్‌మెన్ శ్రీనివాసరావు, లెన్‌మెన్‌లు శ్రీనివాసరావు, కృష్ణ, యుగంధర్, సుబ్బారావు, చేకూరి శ్రీనివాస్, రహీం, సాధిక్ పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు


పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

మణుగూరురూరల్: మొహర్రం పండుగను పురస్కరించుకుని మండలంలోని పీవీకాలనీ వాడల్లో పీర్లను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. హిందూ, ముస్లిం భక్తులు గలీబులీ అర్పించి ఆలాయ్ బలాయ్ చెప్పుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండల, మున్సిపాలిటీ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అధికారులను డిమాండ్ చేశారు. శనివారం జరిగిన హమాలీ శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు ఇబ్బందులు పడకుండా కాలువల పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కొడిశాలరాములు, ఆర్.శ్రీను, సాంబయ్య, అంజి, కిషన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ వితరణ

చండ్రుగొండ: పక్షవాతంతో మంచానికే పరిమితమైన సమ్మెట లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం తరుపున నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ న్యాయ సేవాసమితి లీగల్ వాలంటీర్ ఎం డి.షాజహా వీల్‌చైర్‌ను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగవైకల్యంతో బాధపడ్తున్న వారికి తమ సంస్థ తరుపున పరికరాలు అందిస్తామన్నారు.

గోరింటాకు వేడుకలు


చేతులకు గోరింటాకుతో గురుకుల కళాశాల ఉద్యోగుల ప్రదర్శన..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం 'గురుకులంలో.. గోరింటాకు' పేరుతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని మహిళా ఉద్యోగులు, విద్యార్థినులంతా చేతులకు గోరింటాకు పెట్టుకొని వేడుకగా జరిపారు. దీంతో కళాశాలలో సందడి నెలకొంది. కళాశాల ప్రిన్సిపాల్ వీ స్పందన, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మేటి

- స్వీయ రక్షణకు బాలికల సాధన
- పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న హెచ్‌ఎం

సండే స్పెషల్

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష పరీక్షాన్-సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్'లో భాగంగా బాలికలకు ఉచితంగా కరాటే శిక్షణను ఇస్తుండగా.. మండలంలోని నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నారు. పోటీల్లో మేటిగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో కరాటే ఆవశ్యకతను గుర్తించి.. బాలికలను ఆ దిశగా చైతన్యవంతం చేయడంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బజ్జూరి సరళ కీలకపాత్ర పోషించారు.

కరాటేతో బాలికల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, ఏకాగ్రత స్థాయిలు పెరగడంతో పాటుగా మానసిక శారీరక దృఢత్వం పెంపొందుతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు, వారి స్వీయ రక్షణ కోసం మూడు నెలల పాటు కరాటే శిక్షణ ఇస్తున్నారు. కాగా, నాగుపల్లి పాఠశాలకు చెందిన బాలికలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ.. పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలను గెలుపొందారు.


జాతీయ కరాటే పోటీల్లో పతకాలు గెలుపొందిన బాలికలు (ఫైల్)

పతకాలు కైవసం..

నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు ఖమ్మం జిల్లా పరిధిలోని వంగాముత్యాల బంజరలో ఎఫ్‌ఎస్‌కేఏ వరల్డ్ వారి ఆధ్వర్యంలో 2025, ఫిబ్రవరి 9న నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో విజయబావులా ఎగుర వేశారు. 25 మంది బాలికలు పలు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో నలుగురు బంగారు, ఏడుగురు వెండి, పది మంది కాంస్య పతకాలతో పాటుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరి విజయం పట్ల పలు పార్టీలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు వీరికి అభినందనలు తెలిపారు.

శిక్షణ ఇలా..

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 6 నుండి 10వ తరగతి బాలికలకు ఒక విద్యా సంవత్సరానికి మూడు నెలల పాటు ఈ కరాటే శిక్షణను కొనసాగిస్తారు. శిక్షణలో ప్రధానంగా ప్రాథమిక అంశాలపై అభ్యసనం ఉంటుంది. ముందుగా తేలికపాటి వ్యాయామం ద్వారా కరాటే శిక్షణకు శరీరాన్ని సన్నద్ధం చేస్తారు. తరువాత కరాటేలో ప్రాథమిక అంశాలైన కటా మూమెంట్స్, ఫైటింగ్ స్కిల్స్, అటాకింగ్ మూమెంట్స్, త్రో మూమెంట్స్, స్పారింగ్‌లలో బాలికలకు శిక్షణ ఇస్తారు. శిక్షణలో ప్రధానంగా వీరు తమని తాము రక్షించుకోవడానికి అవసరమైన అన్నిరకాల అటాకింక్ మూమెంట్స్, మెళకువలను నేర్పిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన బాలికలకు ఆత్మస్థైర్యం పెరగడంతో పాటుగా సమాజంలో ధైర్యంగా నిలబడగలుగుతారు.


నాగుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో కరాటే శిక్షణ పొందుతున్న బాలికలు

ఆత్మవిశ్వాసం పెరిగింది..


కరాటే శిక్షణ వల్ల నాలో ఆత్మస్థైర్యంతో పాటుగా ఆత్మవిశ్వాసం పెరిగింది. కరాటే అనగానే మొదట్లో భయమనిపించింది. కానీ హెచ్‌ఎం, కోచ్‌ల ప్రోత్సాహంతో నేర్చుకోవడానికి సిద్ధపడ్డాను. ఆత్మ రక్షణకు సంబంధించిన యుద్ధ కళను నేర్చుకున్నాను. శిక్షణ అనంతరం నాలో శారీరక, మానసిక సామర్థ్యాలు మెరుగుపడ్డాయి.

– కందిమళ్ల శ్రీవిద్య, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్, నాగుపల్లి

ఆసక్తితో నేర్చుకున్నారు..


కరాటేను ఇష్టపూర్వకంగా నేర్చుకోవాలనే తపన, ఆసక్తితో బాలికలు విధిగా శిక్షణా తరగతులకు హాజరయ్యారు. కరాటే శిక్షణలో క్రమం తప్పకుండా ప్రతి అంశాన్నీ.. ఆసక్తి, క్రమశిక్షణ, పట్టుదలతో నేర్చుకున్నారు. శిక్షణకు కేటాయించిన సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. నేర్చుకున్న ఫైటింగ్ స్కిల్స్, మెళకువలను సరైన రీతిలో అవగాహన చేసుకుని విద్యలో పరిణితి సాధించారు.

– పవన్ కృష్ణ, కరాటే కోచ్

ప్రోత్సహించాం..


మా పాఠశాలలో బాలికలకు కరాటే విద్య ప్రాముఖ్యతను, నేటి సమాజంలో ఆత్మ రక్షణ కోసం కరాటే శిక్షణ ఆవశ్యకతను తెలియజేశాం. శిక్షణ పట్ల ఆసక్తి చూపేలా వారిని ప్రోత్సహించి, మెరుగైన శిక్షణ అందేలా కోచ్‌కు సూచనలు చేశాం. ఈ మేరకు విద్యార్థులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.

– బజ్జూరి సరళ, ప్రధానోపాధ్యాయురాలు, నాగుపల్లి జెడ్పీహెచ్‌ఎస్

విద్యుత్ కేంద్రానికి స్థల పరిశీలన

మణుగూరురూరల్: సోలార్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు కోసం మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ ఉడతానేని గుంపు ప్రాంతంలో మణుగూరు ఎంపీడీఓ తేళ్లూరి శ్రీనివాసరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం అబ్దుల్లాలు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీఎం కుసుమ్ 'ఏ'పథకం క్రింద ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ఏర్పాటుకు మొత్తం రూ.3 కోట్ల వ్యయాన్ని అంచనా వేయగా.. కేంద్ర ప్రభుత్వం 30 శాతం, రాష్ట్ర ప్రభుత్వం, బ్యాంకు రుణం, ఎస్‌హెచ్‌జీ సభ్యుల 70 శాతం నిధుల వాటా ద్వారా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పడితే మహిళల ఆర్థిక సాధికారత, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి జరుగుతుందన్నారు.


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పీఏసీఎస్‌లో సహకార వారోత్సవాలు


ములకలపల్లి: సొసైటీ ఆవరణలో మొక్క నాటుతున్న డీఏఓ, సిబ్బంది


బూర్గంపాడు: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం బూర్గంపాడు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరవెండిలో సొసైటీ గోదాం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బీవీ ప్రసాద్, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, నాగలక్ష్మి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలకేంద్రంలోనీ పీఏసీఎస్‌లో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) బాబూరావు పాల్గొని, సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, డైరెక్టర్ ఊకంటి రవికుమార్, సొసైటీ సిబ్బంది బొమ్మకంటి కామేశ్, మహేష్, మురళి, నాగేందర్ తదిరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

అశ్వారావుపేటరూరల్: బాసర, మహబూబ్ నగర్ ట్రిపుల్ ఐటీకీ అశ్వారావుపేట మండలానికి చెందిన పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారి శుక్రవారం విడుదల చేసిన జాబితాలో అశ్వారావుపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుంజా శాంతి, కొండపల్లి కీర్తిశ్రీ, ముదరబోయిన ఊహ, గుజ్జుల శైలజ, ఏనుగుల అఖిల, నల్లబోతుల విజయలక్ష్మి, అదే విధంగా అశ్వారావుపేట బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ యాస్మిన్, కరలకుంట శ్రావణి, మండలంలోని గుమ్మడవల్లి ఉన్నత పాఠశాల నుంచి చందన, మామిళ్లవారిగూడెం ఉన్నత పాఠశాల నుంచి రవళి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థినులకు స్థానిక ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పి హరిత, నల్లపు కొండలరావు, వీరేశ్వరరావుతోపాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థి నిశాల్ మహబూబ్‌నగర్‌లో ఐఐఐటీ సీటు సాధించాడు. నర్సాపురం పాఠశాలలో పదో తరగతిలో 548 మార్కులు సాధించడంతో ఐఐఐటీలో సీటు దక్కింది. నిశాల్‌ను పాఠశాల హెచ్‌ఎం బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందనలు తెలియచేశారు.


అశ్వారావుపేటరూరల్: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులతో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

విద్యార్థికి సన్మానం

అశ్వాపురం: బాసర ఐఐఐటీలో సీటు సాధించిన విద్యార్థి మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వెంగలి లోహితరెడ్డిని శనివారం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఊరుకు మంచి పేరు తీసుకురావాలని గ్రామ పెద్దలు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ప్రసాద్

బూర్గంపాడు: బూర్గంపాడు తహసీల్దార్‌గా కేఆర్‌కే ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ శిరీష లక్ష్మీదేవిపల్లికి బదిలీ కాగా.. అక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ప్రసాద్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరసేవలను వేగవంతం చేస్తామన్నారు.

ఉచిత రక్త పరీక్షలు

చండ్రుగొండ: మండలంలోని ప్రతి గ్రామంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు టీబీ సూపర్‌వైజర్ రఫెల్ తెలిపారు. మండలకేంద్రం చండ్రుగొండ పంచాయతీలో శనివారం టీబీ, షుగర్‌లతోపాటు ఛాతీ ఎక్స్‌రేలు పరీక్షలు చేశారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు మలేరియా, డెంగీ విషజ్వరాల పరీక్షలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ రాజేందర్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండితుల వేదమంత్రోత్సరణ నడుమ భక్తులు వీక్షిస్తుండగా స్వామివారి క్రతువు సాంప్రదాయంగా జరిపించారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంద్ ప్రశాంతం

దమ్మపేట: దమ్మపేట ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని పెట్రోల్ బంక్‌కు ఇవ్వొద్దని, స్థలాన్ని పరిరక్షించాలని శనివారం ప్రదర్శన నిర్వహించారు. ముందుగా యువకుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారి, వీధుల్లో ప్రదర్శన నిర్వహించగా దుకాణాలు బంద్ పాటించారు. దీంతో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. బస్టాండ్ స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

'మత్తు'కు దూరంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పీవైఎస్ రాష్ట్ర కోశాధికారి వాసం బుచ్చిరాజు కోరారు. శనివారం మండలంలోని దురదపాడు గ్రామంలో నిర్వహించిన పీవైఎల్ కౌన్సిల్ సభలో ఆయన మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తుపదార్థాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. యువత ఉపాధి అవకాశాల కోసం ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు గోగినపల్లి ప్రభాకర్, నూప భాస్కర్, పద్దం లక్ష్మణ్‌రావు, జగన్, భూలక్ష్మి, ముత్యాలు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు

అశ్వాపురం: మావోయిస్టులకు సహకరించవద్దని సీఐ అశోక్‌రెడ్డి వలస ఆదివాసీలకు సూచించారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పంచాయతీలోని గుట్టబారు వలస ఆదివాసీ గ్రామాన్ని సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సై మధుప్రసాద్ సిబ్బంది శనివారం సందర్శించారు. గ్రామంలోకి ఎవరైనా కొత్తవారు వచ్చారా అని పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లు, అరెస్ట్‌ల నేపథ్యంలో మావోయిస్టులు ఈ ప్రాంతంలో సంచరించే అవకాశం ఉందని కొత్తవారిని గ్రామంలోకి రానివ్వవద్దని, వారికి సహకరించవద్దని సూచించారు.

కార్డెన్ సెర్చ్..

మణుగూరుటౌన్: ఎటువంటి అపరిచితులు కనిపించినా తమకు సమాచారం అందించాలని, భయభ్రాంతులకు గురికావొద్దని సీఐ నాగబాబు తెలిపారు. శనివారం మండలంలోని సర్వాయి గొత్తికోయ గుంపులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో మాట్లాడారు. సంఘ విద్రోహశక్తులకు, నక్సలైట్లకు ఎటువంటి నిత్యావసర సరుకులు అందించడం వంటి సాయం అందించొద్దని పేర్కొన్నారు. వారి వలన భయభ్రాంతులకు గురికాకుండా పోలీసు వారికి తెలపాలని సూచించారు. ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా పోలీస్ శాఖను నేరుగా కలవొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.


మణుగూరుటౌన్: గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నాగబాబు

ముగిసిన జగన్నాథ యాత్ర


బాహుడా యాత్రలో పూజలు చేస్తున్న జీఎం శ్రీనివాసరావు, ఉద్యోగులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు శనివారం ముగిశాయి. భారజల కర్మాగారంలోని ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అధికారులు, ఉద్యోగుల చేత ఏర్పడిన ఉత్కల్‌పతాగర్ సమితి ఆధ్వర్యంలో గౌతమి నగర్ కాలనీలోని గుండీచాఘర్ మందిరంలో గత తొమ్మిది రోజులుగా భక్తి శ్రద్ధలతో జగన్నాథుని రథయాత్ర నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు కార్యక్రమం బాహుడా యాత్ర శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ యాత్రను జీఎం శ్రీనివాసరావు ప్రారంభించారు. భక్తుల కోలాహలం మధ్య బాహుడా యాత్రలో వందల మంది భక్తులు పాల్గొని రథం ఇరువైపులా బారులు తీరారు. రథాన్ని లాగి స్వాములను ఊరేగింపుగా ఉత్కల్ పతాగర్ మండపంలో యథాస్థానంలో ప్రతిష్ఠించారు. భారజల కర్మాగారం అధికారులు, ఉత్కల్‌పతాగర్ సమితి నిర్వాహకులు, భక్తులు, ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పినపాక: మండలంలోని ఈ బయ్యారం పంచాయతీ కార్యాలయ ఆవరణలో పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ దుర్గాభవాని వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని మహిళలు, వృద్ధులు, వికలాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పంచాయతీ వారీగా సికిల్ సెల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, త్వరలోనే పరీక్షలు పూర్తిచేసి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పగిడేరులో సింగరేణి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు బెనర్జీ 76 మంది వృద్ధులు, మహిళలకు, గ్రామస్తులకు వివిధ రోగాలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రమ్య, ఆయా సౌజన్య, ఉదయ్ తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయండి


మంత్రికి ప్రతిపాదనలు అందజేస్తున్న ఎమ్మెల్యే

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని శనివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. సెక్రటేరియట్‌లో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే.. నియోజకవర్గ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులకు విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

'పిల్లలను ప్రలోభాలకు గురిచేస్తున్నారు..'

ములకలపల్లి: తన పిల్లలు పువ్వాల జ్యోతి, పువ్వాల సాయిలను వారి బాబాయి, మేనత్త ప్రలోభాలకు గురిచేసి తమకు కాకుండా చేశారని తండ్రి పువ్వాల కొండల్‌రావు ఆరోపించారు. భార్య సునీతతో కలసి తాము డీసీసీ బ్యాంక్‌కు అద్దెకిచ్చిన భవనం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల పేరిట సత్తుపల్లిలో రిజిస్ట్రేషన్ చేసిన భూమిని ఏడాది క్రితం తమకు తెలియకుండా జ్యోతి, సాయిలతో విక్రయాంచారని తెలిపారు. రూ.40 లక్షలకు అమ్మి, కేవలం 24 లక్షలు మాత్రమే ఫిక్స్‌డ్ చేశారని, మిగతా డబ్బు ఏమయిందని ప్రశ్నించారు. 2013లో తన కూతురు జ్యోతి ఒడినింపు వేడుకకు కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా బాబాయి, మేనత్తలు చేశారని గుర్తు చేశారు. ఆస్తుల కోసం అక్కాతమ్ముళ్లు (జ్యోతి, సాయి)లతో తమ భవనం వద్ద నిరసన చేయించారని పేర్కొన్నారు.

విత్తనాల సేకరణలో ప్రథమ స్థానం

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): విత్తనాల సేకరణలో మండలంలో ప్రథమ స్థానిలో నిలిచిన ఎర్రగుంట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ అశ్లేషను మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ అభినందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అశ్లేషకు రూ.వేయి నగదు బహుమతిని ఆయన అందించారు. ఐదు నెలల కాలంలో వివిధ రకాల 45కేజీల విత్తనాలను ఆమె సేకరించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ శిరిష, నాగమణి, వెంకటరమణ, అంగోత్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం మండలంలోని తిరుమలకుంట గ్రామంలోని రైతువేదికలో భద్రాచలం ఐటీడీఏ ద్వారా గ్రామస్తులకు కేంద్రం అమలు చేస్తున్న పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా పథకాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి కార్తీక్, సీసీ సత్యనారాయణ, బ్యాంక్‌మిత్ర వెంకట మహాలక్ష్మి పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి బైక్ ర్యాలీ

బూర్గంపాడు: ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం బూర్గంపాడు మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కన్వీనర్ పాండవుల రామనాథం మాట్లాడుతూ.. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, కందుకూరి నాగేశ్వరరావు, నూనె వెంకన్న, శ్రీనివాసరావు, ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఈ నెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌సీ, ఏరియా వర్క్‌షాప్‌లలో జరిగిన సమావేశాలలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశాల్లో నాయకులు వై.రాం గోపాల్, వత్సవాయి కృష్ణంరాజు, నాగెల్లి వెంకటేశ్వర్లు, బ్రహ్మచారి, ఆర్ మధుసూధన్‌రెడ్డి, ఎంవీ రామనర్సయ్య, అబ్దుల్ రవూఫ్, వెంకటరత్నం, ముకేష్ కుమార్, ఇమ్రాన్, కల్యాణ్ కుమార్, వేర్పుల జాన్ తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెపై ప్రచారం

ములకలపల్లి: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూసఫ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో జగన్నాథపురంలో శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. జీపీ కార్యదర్శి ఇబ్రహీంకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ నెల 9 జరుపతలపెట్టిన సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం ప్రకటించాలని కోరారు. సంఘ మండల కార్యదర్శి జబ్బార్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.